పెద్దాస్పత్రికి నిర్లక్ష్య జబ్బు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి


వీల్‌చైర్ లేక అతికష్టంపై నడుస్తున్న వృద్ధుడు

- లిఫ్టులు పనిచేసేదెప్పుడో..?
- నడవలేక వృద్ధులు, దివ్యాంగుల అగచాట్లు
- వీల్‌చైర్లకూ కటకటే
- కదలని మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు

నెల్లూరు(అర్బన్): జిల్లాకే రెఫరల్ ఆస్పత్రిగా ఉన్న నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వాస్తవానికి ఇక్కడ పెద్ద డాక్టర్లు.. స్పెషలిస్టులు, సూపర్ స్పెషలిస్టులూ ఉన్నారు. ఆస్పత్రిలో డాక్టర్లకు కనీస సౌకర్యాలు కల్పించి రోగులకు ఇబ్బందులు తొలగిస్తే మంచి వైద్యసేవలందుతాయి. అయితే ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. అధికారుల అలసత్వంతో పాలన పడకేసింది. చిన్న సమస్యలను సైతం పరిష్కరించకపోవడంతో సమస్యల వలయంలో ఆస్పత్రి కొట్టుమిట్టాడుతోంది. సీటీ, ఎమ్మారై, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎకోతో పాటు దాదాపు అన్ని రకాల రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నా, ఆ సేవలు రోగులకు సక్రమంగా అందడంలేదు.

మెండుగా ఓపీలు

దర్గామిట్టలో ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా పెద్దాస్పత్రి ఉంది. 750 పడకలతో దీన్ని ఆధునికీకరించారు. అధునాతన మాడ్యులర్ థియేటర్లున్నాయి. రోజూ 1100 నుంచి 1300 మందికి ఓపీ సేవలను అందిస్తున్నారు. 500 మంది వరకు ఇన్‌పేషెంట్లున్నారు. సాధారణ వైద్యసేవలతో పాటు ఆర్థోపెడిక్, చర్మ, పల్మనాలజీ, గైనకాలజీ, పీడియాట్రిక్ లాంటి సేవలందుతున్నాయి. న్యూరాలజీ, యూరాలజీ, కేన్సర్లకు సూపర్‌స్పెషాల్టీ సేవలు అందుబాటులో ఉన్నాయి. రోగుల కోసం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తున్నా, సమస్యలు మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.

పనిచేయని లిఫ్ట్

➡ సెంట్రల్ ల్యాబొరెటరీలోని మొదటి అంతస్తులో రక్తపరీక్షలు చేస్తున్నారు. అయితే ఇక్కడి లిఫ్ట్ ఒకరోజు పనిచేస్తే మరో రోజు పనిచేయడం లేదు. ఈ క్రమంలో వృద్ధులు, నడవలేని వారు, అంగవైకల్యం ఉన్న వారు మెట్లెక్కలేక నానా అగచాట్లు పడుతున్నారు. పలువురు రక్త పరీక్షలు చేయించుకోకుండానే వెనుదిరుగుతున్నారు.

➡ డాక్టర్ వద్ద చెక్ చేయించుకొని కష్టమ్మీద మెట్లెక్కి మొదటి అంతస్తులో ఉన్న రక్తపరీక్ష రూమ్ వద్దకు 12 గంటల తర్వాత రోగులు వెళ్తే, సమయమైపోయింది.. రేపు రండి అంటూ వెనక్కి పంపుతున్నారు.

బిల్లులకూ కష్టాలే..

రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, రిటైరైన వారు వివిధ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేయించుకుంటారు. వీరికి సంబంధించిన మెడికల్ బిల్లులు పెద్దాస్పత్రికే వస్తాయి. వీటిని డాక్టర్లు పరిశీలించి ఆమోద ముద్ర వేస్తే, అక్కడి నుంచి ప్రభుత్వానికి వెళ్తాయి. అప్పుడే బిల్లులొస్తాయి. కంటి ఆపరేషన్లకు గానూ రూ.15 వేలనే విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం విడుదల చేస్తుంది. అయితే రూ.30 వేలు, రూ.లక్ష మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులొస్తాయి. వీటిని పెద్దాస్పత్రిలో పరిశీలించకుండా నెలల పాటు తిప్పుకొంటున్నారు. ఇలా సుమారు 700 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం.

పింఛన్ల దరఖాస్తుల తీరూ ఇంతే..

బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం ఇలా పలు వ్యాధులకు గురై అసలు కదల్లేక మంచాన ఉండే రోగులు అనేక మంది ఉన్నారు. ఇలా బెడ్ రిడన్ రోగులకు పింఛన్ రూపంలో రూ.15 వేలను ప్రభుత్వం ఇస్తోంది. దీన్ని పొందాలంటే రోగుల కుటుంబ సభ్యులు పెద్దాస్పత్రిలోని మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకోవాలి. చికిత్స, వైకల్యాన్ని పరిశీలించి బెడ్‌పై ఉంటే సర్టిఫికెట్‌ను బోర్డులోని డాక్టర్లు జారీ చేయాల్సి ఉంటుంది. తదుపరి పింఛన్ కోసం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అయితే ఈ దరఖాస్తులను సైతం పెండింగ్‌లో ఉంచుతున్నారు. ఇలా ఇప్పటికే సుమారు 100 వరకు పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాబోయ్.. అంధకారం

నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. తాజాగా గత మంగళవారం సైతం ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో పలు వార్డుల్లో చీకట్లు కమ్ముకున్నాయి. జనరేటర్లున్నా, ఓపీ భవనంలో వెలుతురు సక్రమంగా రాలేదు. సెంట్రల్ ల్యాబొరెటరీ వద్ద జనరేటర్లతో స్కానింగ్, ఎక్స్‌రే, ఎమ్మారై పరీక్షలను చేయలేమని సిబ్బంది చేతులెత్తేయడంతో రోగులు నానా అవస్థలు పడ్డారు. సరఫరా కోసం నిరీక్షించారు. విద్యుత్ అధికారులకు ఫోన్ చేసినా, సమస్య తమది కాదని.. ఆస్పత్రి విద్యుత్ లైనింగ్‌లో ఎక్కడో లోపం ఉందంటున్నారని డాక్టర్లు పేర్కొంటున్నారు.



అగచాట్లకు అడ్డాగా..

➡ ఎక్స్‌రే, స్కానింగ్ కేంద్రాల వద్ద తగినంత కుర్చీల్లేక రోగులు నానా అవస్థ పడుతున్నారు. పరీక్ష కేంద్రాల వద్దకు తీసుకొచ్చేందుకు అటెండర్లు సరిపడా లేరు. వీల్‌చైర్లూ లేవు. దీంతో పేషెంట్లను కుటుంబీకులే నడిపించుకొని పరీక్ష/కేంద్రాల వద్దకు తీసుకెళ్తున్నారు.

➡ సీటీ, ఎమ్మారై స్కానింగ్ కేంద్రాల వద్ద టెక్నీషియన్ పోస్ట్ ఖాళీగా ఉంది. ఫలితంగా ఎమ్మారై పరీక్ష చేయడంలో జాప్యం జరుగుతోంది.

➡ ఫిజియోథెరపిస్టులు సరిపడా ఉన్నా, అక్కడ కనీసం ఒక్క పరికరం లేదు. దీంతో పక్షవాత రోగులు, మెడ, భుజం పట్టేసిన వారు, నడుము నొప్పులతో బాధపడే వారికి ఫిజియోథెరపీ సేవలందడం లేదు.


కుర్చీల్లేక నేలపైనే రోగులు, సహాయకులు

కుక్కలు, పందుల స్వైర విహారం



పెద్దాస్పత్రిలో కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆర్థోపెడిక్ విభాగం, మొదటి అంతస్తులతో పాటు ఐపీ బిల్డింగ్‌లో కుక్కలు మలమూత్రాలను విసర్జిస్తున్నాయి. కుక్కలు కరిస్తే తమ పరిస్థితి ఏమిటని రోగులు ప్రశ్నిస్తున్నారు. వీటి వల్ల రోగులకు కొత్త వ్యాధులొచ్చే ప్రమాదం ఉంది.

సమస్యలు పరిష్కరిస్తున్నాం

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు ఇబ్బందుల్లేకుండా సమస్యలను పరిష్కరిస్తున్నాం. లిఫ్ట్‌ను బాగుచేయించాం. కుక్కలు, పందుల బెడద లేకుండా సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తం చేశాం. ఫిజియోథెరపీకి సంబంధించిన పరికరాలను త్వరలో కొనుగోలు చేయనున్నాం.

– సిద్ధానాయక్, సూపరింటెండెంట్, జీజీహెచ్

క్లుప్తంగా

భార్య, అత్తపై కత్తితో దాడి

నెల్లూరు(క్రైమ్): భార్య, అత్తపై అల్లుడు కత్తితో దాడి చేసి గాయపర్చిన ఘటన భగత్‌సింగ్‌కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. భగత్‌సింగ్‌కాలనీకి చెందిన మాధవికి ముత్తుకూరుకు చెందిన సురేష్‌తో సుమారు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబకలహాల నేపథ్యంలో మూడు నెలల క్రితం మాధవి పుట్టింటికెళ్లారు. కాపురానికి రావాలని భార్యను పలుమార్లు కోరగా, ఆమె నిరాకరించారు. దీంతో ఆగ్రహానికి గురైన సురేష్ అత్తింటికెళ్లారు. కత్తితో భార్య, అడ్డుకోబోయిన అత్తపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కవి రామకృష్ణకు పురస్కారం

నెల్లూరు(బృందావనం): చెన్నైలోని రాజ్‌భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు ఆఫ్ హానర్‌ను నెల్లూరుకు చెందిన కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ అందుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన తెలియజేశారు. తిరువళ్లువార్, కబీర్, యోగి వేమనపై అంతర్జాతీయ బహుభాషా అధ్యయన సదస్సును తమిళ్ కల్చరల్ రీసెర్చ్ సెంటర్, పాలక్కాడ్.. చెన్నై హిందీ ప్రచారక్ సంఘ్.. అజ్మీర్‌దావ్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించారని చెప్పారు. ఈ క్రమంలో అవార్డును అందజేశారని తెలిపారు.

ప్రతిపాదనను విరమించుకోవాలి

నెల్లూరు (టౌన్): ఉన్నత పాఠశాలల సమయ వేళల్లో మార్పు ప్రతిపాదనను విరమించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, కార్యదర్శి పిచ్చిబాబు, రాష్ట్ర కమిటీ సభ్యుడు రియాజ్ కోరారు. ఈ మేరకు ఆన్‌లైన్లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంటుందని, పాత వేళలనే కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పీఎఫ్, సరెండర్ లీవులు, కరువు భత్యం బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. నేతలు కృష్ణారెడ్డి, అలీ, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, మురళీకృష్ణ, బాలకృష్ణారెడ్డి, సుంకు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెట్ల ఎంపికలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అథ్లెట్ల ఎంపికలను నెల్లూరు వెటరన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. 45 మంది పురుషులు, 37 మంది స్త్రీలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, బసవయ్య తెలిపారు. గుడివాడలో డిసెంబర్ 14, 15న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని చెప్పారు. అసోసియేషన్ మహిళాధ్యక్షురాలు కోటేశ్వరమ్మ, జాయింట్ సెక్రటరీ హజరత్‌బాబు, ట్రెజరర్ శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



నెల్లూరు(అర్బన్): ఏపీ స్టేట్ హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మలినేని భానుమూర్తిని సంఘ రాష్ట్ర జనరల్ సెక్రటరీ చేజర్ల సుధాకర్‌రావు తదితరులు సత్కరించారు. తిరుపతి జిల్లా డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి పొందిన నేపథ్యంలో హరనాథపురంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జ్ఞాపికను అందజేశారు. నేతలు బాలు, మల్లికార్జున, ఝాన్సీలక్ష్మి, హరిప్రసాద్, సునీత, అశోక్, ఉమర్, ఆరోగ్యమేరీ, బీబీజాన్, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కపాళేనికి శృంగేరి పీఠాధిపతి


మాట్లాడుతున్న విధుశేఖరభారతి

వెంకటాచలం : మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో ఉన్న సంస్కృత పాఠశాలను శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతిస్వామి ఆదివారం సందర్శించారు. పాఠశాలలో కల్పిస్తున్న వసతులపై విద్యార్థులతో ముచ్చటించారు. మంచి, చెడుల గురించి చిన్నతనం నుంచే తెలుసుకోవాలని, అభివృద్ధి వైపు ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కాంక్షించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్వతరెడ్డి ఇంటి వద్ద కోలాహలం


చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ముస్లిం మతపెద్దల ప్రార్థనలు

నెల్లూరు(బారకాసు): రామ్‌జీనగర్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కార్యాలయం వద్ద పార్టీ నేతలు, కార్యకర్తలతో సందడి వాతావరణం ఆదివారం నెలకొంది. 52వ డివిజన్‌కు చెందిన దాదాపు 500 మంది పార్టీ నేతలు, కార్యకర్తలు పార్టీ మైనార్టీ నేత మాబాషా ఆధ్వర్యంలో చేరుకొని జై జగన్ అనే నినాదాలతో హోరెత్తించారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆర్థిక సాయం అందజేత



నెల్లూరు (టౌన్): అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయుడు కొండయ్య కుటుంబానికి ఆర్థిక సాయాన్ని ఆంధ్రప్రదేశ ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఆదివారం అందజేశారు. ఈ మేరకు నీలగిరి సంఘంలోని నివాసానికి వెళ్లి రూ.22 వేలను కుటుంబసభ్యులకు ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వమోహన్, కార్యదర్శి శంకర్, కోశాధికారి కిశోర్, వర్కింగ్ ప్రెసిడెంట్ భరద్వాజ, సభ్యులు మనోహర్, సాయిబాబా పాల్గొన్నారు.

కృష్ణతత్వంపై ఉపన్యాసం


శివకుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిర ప్రాంగణంలో గల చక్రాల వారి ట్రస్ట్ కార్యాలయంలో కార్యక్రమాన్ని గోవిందరాజు సీతాదేవి సాహిత్య వేదిక నిర్వాహకులు గోవిందరాజు సుభద్రాదేవి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కృష్ణతత్వంపై కవి గంగిశెట్టి శివకుమార్ ఉపన్యసించారు. శివకేశవులు ఒకటేనని వివరించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. ట్రస్ట్ మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీనరసింహం, కవులు శ్రీధర్ బాబు, శ్రీరామ్మూర్తి, సులోచన, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

నెల్లూరు(బారకాసు): నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలపై ప్రజలు తమ అర్జీలను ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు అందజేయాలని కోరారు.

ఉత్సాహంగా వనభోజనాలు



నెల్లూరు రూరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని మూడో మైలు సమీపంలో గల దివ్యాంగుల సేవా కేంద్రంలో వనభోజనాలను ఆదివారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరి, రంగయ్య, బాలసుబ్రహ్మణ్యం, నవీన్, వినయ్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

చర్చా వేదిక రేపు

నెల్లూరు(అర్బన్): సనాతనవాదమా.. మానవతావాదమా అనే అంశంపై హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో చర్చా వేదికను మంగళవారం సాయంత్రం నిర్వహించనున్నామని జేవీవీ నేత డాక్టర్ శ్రీనునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు.

రామ్మూర్తినాయుడికి నివాళి

నెల్లూరు(సెంట్రల్): నారా రామ్మూర్తినాయుడి మృతి బాధాకరమని మంత్రి నారాయణ పేర్కొన్నారు. గోమతినగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఆదివారం నివాళులర్పించారు.

- టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని మంత్రి నారాయణ కోరారు. ఈ మేరకు పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు.

జనహిత - వాత్సల్యలో అన్నదానం

నెల్లూరు(బృందావనం): వనంతోపు సమీపంలోని జనహిత, వాత్సల్య నిరాధార బాలల కేంద్రంలో అన్నదానాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడారు. విశ్రాంత స్పెషల్ బ్రాంచ్ ఎస్సైలు తక్కోలు వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి కమార్తె సాయిహరిప్రియ, నిఖిలేష్‌కుమార్ వివాహాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారని వివరించారు. మానవ సేవే మాధవ సేవ బృంద సభ్యులు రమణరావు, శ్రీనివాసులు, పుల్లారెడ్డి, అరుణరాణి, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో మూర్ఛకు దూరంగా ఉండొచ్చు


డాక్టర్ వైష్ణవిని సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(అర్బన్): అవగాహన, తగు జాగ్రత్తలతో మూర్ఛ వ్యాధిని తగ్గించొచ్చని న్యూరో ఫిజీషియన్ వైష్ణవి పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఫోనిక్స్ హాస్పిటల్లో జాతీయ మూర్ఛ వ్యాధి నివారణ దినోత్సవాన్ని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వైద్యుల పర్యవేక్షణలో మందులను క్రమం తప్పకుండా వాడితే మూర్ఛ నయమవుతుందని చెప్పారు. అనంతరం ఆమెను సత్కరించారు. డాక్టర్ గోకుల్‌కృష్ణన్, పీహెచ్‌పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, వీరయ్య, రామదాసు, భారతి తదితరులు పాల్గొన్నారు.

గొలగమూడికి సాయిభక్తుల పాదయాత్ర



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిరం నుంచి గొలగమూడిలోని వెంకయ్యస్వామి సన్నిధి వరకు పాదయాత్రను సాయి మాలధారులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి మాట్లాడారు. సాయి మాలధారణ మండల దీక్ష – షిర్డీయాత్రను పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. దాదాపు 430 మంది భక్తులు పాదయాత్రలో పాలుపంచుకున్నారు. మందిర గౌరవాధ్యక్షుడు పాబోలు రామసుబ్బయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రాల వితరణ



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు, పంచలు, టవళ్లు తదితరాలను జనతా ఫౌండేషన్ నిర్వాహకుడు దాసరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. ఫౌండేషన్ సభ్యుడు సందీప్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత డీఎస్పీ తోట ప్రభాకర్ హాజరయ్యారు. నరేంద్రరాజా, కాయల మధు, పెంచలనరసింహ, మనోజ్‌కుమార్, భగవాన్, వినయ్, సుధీర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో రక్తదాన శిబిరం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో గల నిస్సీ ఫిజియోథెరపీ, సేవ్ యో క్లినిక్‌లో రక్తదాన శిబిరాన్ని డాక్టర్ రాకేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, దీనికి అందరూ ముందుకురావాలని ఆయన కోరారు.

రూ.15 కోట్లతో స్వర్ణాల చెరువు అభివృద్ధి


మహాకుంభాభిషేక మహోత్సవంలో నారాయణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని స్వర్ణాల చెరువును మరో రూ.15 కోట్లతో అభివృద్ధి చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ మహాకుంభాభిషేక మహోత్సవంలో ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. 2014లో టీడీపీ హయాంలో అప్పటి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడి సహకారంతో ఎంతో అభివృద్ధి చేశామని వివరించారు. స్వర్ణలింగేశ్వరస్వామి దయతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కాంక్షించారు.